శ్రీక్షేత్రం ప్రసాదాల తయారీకి వాడే నెయ్యి
నాణ్యత పరిశీలన




తిరుపతి 'లడ్డూ' వివాదం నేపథ్యంలో నిర్ణయం

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో వినియోగిస్తున్న నెయ్యిలో పశువుల కొవ్వు ఉంటోందన్న ఆరోపణలు కోట్లాది మంది భక్తులను ఆవేదనకు గురిచేసింది. ఈ నేపథ్యంలో పూరీ శ్రీక్షేత్రంలో జగన్నాథునికి అర్పిస్తున్న మహాప్రసాదం, మరో 56 రకాల పిండివంటకాలకు వినియోగిస్తున్న నెయ్యి స్వచ్ఛమైనదేనా అన్న అనుమానాలు భక్తుల్లో వ్యక్తమయ్యాయి. దీన్ని దృష్టిలో పెట్టుకున్న యంత్రాంగం నాణ్యత పరిశీలనకు సన్నద్ధమైంది. స్వామి ప్రసాదానికి కావలసిన, గర్భగుడిలో నిరంతరం వెలిగే అఖండ దీపానికి మంచి నెయ్యినే వినియోగిస్తారు. ఓంఫెడ్ సంస్థ పూరీ ప్రసాదాలు, దీపాలకు అవసరమైన నెయ్యి సరఫరా చేస్తోంది. మంగళవారం పూరీ జిల్లా పాలనాధికారి సిద్ధార్థశంకర్ స్వయిన్ విలేకరులతో మాట్లాడుతూ శ్రీక్షేత్రంలో ప్రసాదాలు, దీపాలకు వినియోగిస్తున్న ఓంఫెడ్ నెయ్యిపై ఎలాంటి అభియోగాలు లేకపోయినా తిరుపతి లడ్డూల ఘటన నేపథ్యంలో నాణ్యత పరిశీలించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనిపై పురుషోత్తముని ప్రసాదాలు తయారీ చేసే సువార్, మహాసువార్ సేవాయత్‌లు, ఓంఫెడ్ ప్రతినిధులతో సమావేశమై నాణ్యత పరిశీలన దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పూరీ జగన్నాథుని ఒబడా ప్రసాదాలు

నైపుణ్యం పెంచుకోవాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రపంచీకరణ తరువాత నైపుణ్యం ఉన్నవారికి ప్రముఖ కంపెనీలు ఎర్ర తివాచీ పరుస్తున్నాయని, ఇది గొప్ప అవకాశమని, రాష్ట్ర యువతీయువకులు నైపుణ్యాలు పెంచుకోవాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పిలుపునిచ్చారు. సింగపూర్ ప్రపంచ నైపుణ్య కేంద్రంలో శిక్షణ పొందుతున్న రాష్ట్ర యువతీయువకులు మంగళవారం భువనేశ్వర్ వచ్చారు. లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్, పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వయిన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహుజా తదితరుల్ని కలిశారు. వారిని అభినందించిన ముఖ్యమంత్రి ఆర్థిక సాయం చేశారు.


ప్రతిభ చూపిన విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ముఖ్యమంత్రి

57 ఠాణాలకు సీసీ కెమెరాలు: డీజీపీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ ఠాణా ఘటన తరువాత పోలీసుశాఖ అన్ని ఠాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు నిర్ణయం తీసుకుంది. అక్టోబరు 8 లోగా 57 ఠాణాల్లో వీటిని అమర్చాల్సి ఉంది. మొరాయించిన మరో 29 ఠాణాల్లోని కెమెరాలను మార్చాలని డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా ఆదేశించారు. ఒడిశా కంప్యూటర్ అప్లికేషన్ సెంటర్‌కు ఈ బాధ్యత అప్పగించారు. భరత్‌పూర్ ఘటన నేపథ్యంలో ఠాణాల్లో సీసీ కెమెరాలు లేకపోవడం తీవ్రమైన అంశంగా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పరిగణించింది. దీనిపై నివేదిక సమర్పించాలని పోలీసు యంత్రాంగానికి ఆదేశించిన సంగతి తెలిసిందే.



వాడకుండా వదిలేశారు

కటక్‌లోని పోలీసుశాఖ ప్రధాన కార్యాలయం ఆవరణలో 86 ఠాణాలకు సంబంధించి కొనుగోలు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా పడున్నాయి. 2019-20లో గత ప్రభుత్వం అన్ని ఠాణాల ఆధునికీకరణకు నిర్ణయం తీసుకుంది. కెమెరాలు అమర్చే బాధ్యతను ఒక సంస్థకు అప్పగించింది. 2020 మార్చి 25 నాటికి అన్ని ఠాణాల్లో వీటి అమరిక పూర్తవుతుందని నాటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. రాష్ట్రంలోని 612 ఠాణాలకుగాను, 25 శాతం ఠాణాల్లో వీటిని అమర్చలేదు.

ఇదీ భరత్‌పూర్ దుస్థితి

గతేడాది డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి నవీన్ భువనేశ్వర్ చందక పరిధిలో భరత్‌పూర్ ఆదర్శ ఠాణాను ప్రారంభించారు. ఇది రాష్ట్రంలోని ఇతర స్టేషన్లకంటే భిన్నం. అత్యాధునిక సౌకర్యాలున్నాయని ఆయన చెప్పారు. ఈ నెల 15 రాత్రి రక్షణశాఖ అధికారి, ఆయన స్నేహితురాలిపై జరిగిన ఘటన తరువాత ఈ ఠాణాల్లో కెమెరాలు లేవని స్పష్టమైంది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం పోలీసు శాఖను మందలించిన తరువాత కెమెరాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

గోపాలపూర్, న్యూస్‌టుడే: కేంద్ర బంగాళాఖాతంలో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల మధ్య మంగళవారం అల్పపీడనం ఏర్పడినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. పీడనానికి అనుబంధంగా సముద్ర ఉపరితలంలో 7.6 కిలోమీటర్ల ఎత్తులో మరో ఆవర్తనం కొనసాగుతోందన్నారు. దీని ప్రభావంతో గడచిన 24 గంటల్లో ఉత్తరకోస్తా, దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయన్నారు. జాజ్‌పూర్ జిల్లా బింజార్‌పూర్‌లో అత్యధిక వర్షపాతం 11 సెం.మీ.గా నమోదైందన్నారు. బుధవారం సుందర్‌గఢ్, ఝార్సుగుడ, బరగఢ్, సంబల్‌పూర్, దేవ్‌గఢ్, అనుగుల్, ఢెంకనాల్, కేందుఝర్, మయూర్‌భంజ్, బాలేశ్వర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రపడ, కటక్, జగత్సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా, నయాగఢ్, గంజాం, గజపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎల్లో హెచ్చరికలు జారీచేశామన్నారు. నువాపడ, కొంధమాల్, కలహండి, కొరాపుట్ జిల్లాల్లో కాలవైశాఖి ప్రభావం ఉంటుందని, 26వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలకు అవకాశం ఉందన్నారు.

వృక్ష విలాపం



ఓ వైపు ప్రభుత్వం అమ్మ పేరిట మొక్క నాటి నీరుపోసి పెంచాలంటోంది. పర్యావరణాన్ని పరిరక్షించాలంటోంది. మరోవైపు అభివృద్ధి పేరుతో ఏపుగా పెరిగిన వృక్షాలను నరికేస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది కలపను విక్రయించి సొమ్ము చేసుకుంటుండడం గమనార్హం. కొరాపుట్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఎన్‌హెచ్26కు ఇరువైపులా నీడనిచ్చే చెట్లను నరికేసిన దృశ్యానికి ఈ చిత్రమే ఉదాహరణ.– న్యూస్‌టుడే, కొరాపుట్

రాష్ట్రంలో పరిశ్రమల నిర్మాణం నుంచి వైదొలిగిన జేఎస్‌డబ్ల్యూ?

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పరదీప్, కటక్‌లలో ఈ వాహనాల బ్యాటరీ తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్న జేఎస్‌డబ్ల్యూ కంపెనీ ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు మంగళవారం జాతీయ ప్రసార సాధనాల్లో చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 10న అప్పటి నవీన్ పట్నాయక్ ప్రభుత్వంతో జేఎస్‌డబ్ల్యూతో ఒప్పందం కుదుర్చుకుంది. రూ.40 వేల కోట్ల వ్యయంతో రెండు నిర్మాణాలు చేస్తామని అప్పట్లో ఈ పరిశ్రమ ప్రకటించింది. ఇంతలో ఇక్కడి నుంచి తప్పుకున్న పరిశ్రమ మహారాష్ట్రలో నిర్మాణాలు చేయడానికి సన్నద్ధమైనట్లు తెలిసింది. దీనిపై పరిశ్రమలశాఖ మంత్రి సంపద్ స్వయిన్ భువనేశ్వర్‌లో విలేకరులతో మాట్లాడుతూ దీనిపై తమకు ఎలాంటి సమాచారం లేదని కంపెనీ వర్గాలతో మాట్లాడతామని చెప్పారు. ఇబ్బందులుంటే తెలుసుకునే ప్రయత్నం చేస్తామన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు భూ సేకరణలో ప్రభుత్వం జాప్యం చేయడం వల్లే కంపెనీ వైదొలగడానికి ప్రధాన కారణమన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.


నవీన్ సమక్షంలో ఫిబ్రవరిలో ఒప్పందం (పాత చిత్రం)

రోడ్డు భద్రతపై గ్రామస్థుల వినూత్న చైతన్యం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కుకుడాఖండి సమితిలో దక్షిణాపూర్ పంచాయతీ మీదుగా 17వ రాష్ట్ర రహదారి కొనసాగుతోంది. ఈ రోడ్డుపై గ్రామం సమీపాన తరచూ రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రహదారిపై వేగ నిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) ఏర్పాటు చేయాలని గ్రామస్థులు పలుమార్లు యంత్రాంగానికి విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో రోడ్డు భద్రతపై వినూత్న చైతన్యానికి వారు శ్రీకారం చుట్టారు.


దక్షిణాపూర్ గ్రామం రహదారి పక్కన ప్లకార్డులతో యువకులు, బాలురు

నిత్యం వాహనాల రద్దీ

బ్రహ్మపుర-దిగపోహండి రోడ్డులోని దక్షిణాపూర్ గ్రామం మీదుగా సాగుతున్న రహదారి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటోంది. సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలు, ట్యాంకర్లు ఇలా రోజంతా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎక్కువమంది చోదకులు నిర్లక్ష్యంగా, వేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో సుమారు మూడు నెలల కిందట గ్రామస్థులు ప్లకార్డులతో ప్రచారం చేపట్టారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం దక్షిణాపూర్‌లోని ప్రధాన రహదారి పక్కన గ్రామానికి చెందిన పిల్లల నుంచి వృద్ధుల వరకూ అంతా వంతులవారీగా ప్లకార్డులతో చోదకుల్ని చైతన్యపరుస్తున్నామని రబీంద్రనాథ్ సాహు, ప్రదీప్ సాహు, కన్హయ సాహు విలేకరులకు చెప్పారు. గ్రామంలో వాహనాలు మెల్లగా నడపాలని, ఓవర్‌టేక్ చేయవద్దని కోరుతున్నారు. ద్విచక్ర వాహన చోదకుడు శిరస్త్రాణం ధరించాలని, ముగ్గురేసి ద్విచక్ర వాహనాపై వెళ్లొద్దని కోరుతున్నారు. చోదకులను ఆపి చాక్లెట్లు ఇస్తున్నారు. జీవితం కూడా చాక్లెట్‌లా మధురమని, దీన్ని నిర్లక్ష్యం చేయొద్దని కోరుతున్నారు.


వాహన చోదకుల్ని చైతన్యపరుస్తున్న గ్రామస్థులు



బాబూ... 'నీవు పెద్దయితే నన్ను చక్కగా చూసుకుంటావా' అని అడగకుండానే వారికి ఆ తల్లి స్తన్యమిచ్చి పెంచింది. 'నేను ఆకలితో ఉండకుండా అన్నం పెడతారా' అని ప్రశ్నించకుండానే వారికి గోరుముద్దలు తినిపించింది. తాను వృద్ధురాలినైతే ఆసరాగా ఉంటారా అని ఆలోచించకుండానే వారికి అడుగులు నేర్పింది.. వారు పెరిగి పెద్దవారైతే మురిసిపోయింది. పెళ్లిళ్లు చేసింది. మనవలు, మనవరాళ్లతో ఆడుకోవలసిన వయసులో కొడుకులు తనను వంతుల వారీగా చూసుకోవడం, భోజనం సరిగా పెట్టకపోవడంతో ఆ తల్లి గుండె ముక్కలైంది. ఆకలి అంటూ రోదిస్తోంది.

ఆకలంటూ ఏడ్చిన అమ్మ

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భర్త మరణానంతరం కుమారుల వద్ద వంతులవారీగా ఉన్న శశి బిశోయి (75) పిడికెడు మెతుకుల కోసం పడుతున్న వేదన నెటిజన్లను కంటతడి పెట్టిస్తోంది. గంజాం జిల్లా సన్నొఖెముండి సమితిలోని డెంగాఒస్తా గ్రామానికి చెందిన శశిను కుమారుడు ఇంట్లో నిర్బంధించగా, ఆకలంటూ ఆమె వేస్తున్న కేకల వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కెర్లు కొట్టింది. ప్రాథమిక వివరాల మేరకు.. శశి భర్త ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం మృతిచెందారు. వారికి ముగ్గురు కుమారులు. తండ్రి మరణాంతరం తల్లిని ముగ్గురూ వంతులవారీగా చూసుకునేవారు. ఆమె పెద్ద కుమారుడు కూడా ఉపాధ్యాయునిగా పనిచేస్తూ మృతి చెందారు. దీంతో ఆమె కష్టాలు పెరిగాయి. ఇంట్లో పెద్ద కుమారుడి భార్య, కొడుకు ఆమెను నిర్బంధించి ఉంచగా, వారింటికి పొరుగున ఉన్న ఇంటి నుంచి మరో కుమారుడు ఆమెకు ఆహారం అందించాడంటూ వార్తలు వచ్చాయి. ఈ సమస్యపై గతంలో తల్లి శశి పట్టపూర్ ఠాణాలో ఫిర్యాదు చేయగా, అప్పట్లో పోలీసుల జోక్యంతో పరిస్థితి చక్కబడినా, తర్వాత మళ్లీ పూర్వస్థితికి వచ్చిందని గ్రామస్థులు అంటున్నారు.

శక్తిపీఠాల్లో మూలాష్టమి సేవలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: ఆశ్వీయుజ బహుళపక్షమి అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ శక్తిపీఠాల్లో అమ్మవార్లకు షోడశోపచార సేవలు ప్రారంభమయ్యాయి. పూరీ శ్రీక్షేత్రంలో విమలమ్మకు సహస్ర కుంభాభిషేకం సేవలు నిర్వహించారు. 16 రోజుల వరకు తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తారు. విమలమ్మకు షోడశోపచార సేవలు చేసే సేవాయత్‌లకు పూరీ రాజప్రసాదంలో గౌరవించడం ఆనవాయితీ. 21 మంది సేవాయత్‌లకు వస్త్రాలు, కానుకలు సమర్పించారు.


కటక్ ఛండీ అమ్మవారు

రేపటి నుంచి అవతారాలు

సుప్రసిద్ధ కటక్ చండీ శక్తి పీఠంలోనూ మంగళవారం నుంచి ప్రత్యేక సేవలు ప్రారంభమయ్యాయి. షోడశోపచార పూజలకు అంకురార్పణ జరిగింది. గురువారం నుంచి మహానవమి వరకు అమ్మవారి అవతారాలు ఏర్పాటవుతాయి. బుధవారం అమ్మవారిని భువనేశ్వరి రూపంలో అలంకరిస్తారు. జాజ్‌పూర్ బిరజ, సంబల్‌పూర్ శామలాయి, బాణపూర్ భగవతి, కాకట్‌పూర్ మంగళ, భవానీపాట్న మణికేశ్వరి తదితర శక్తిపీఠాల్లోనూ షోడశోపచార పూజలకు అంకురార్పణ జరిగింది.

సంజయ్ ఆత్మహత్యపై విచారణకు ఆదేశం
డీఎఫ్‌వోపై ఆరోపణలను తీవ్రంగా తీసుకున్న అటవీశాఖ

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: కలహండి జిల్లాలో విధులు నిర్వహిస్తూ ఆత్మహత్యకు పాల్పడిన రాయగడకు చెందిన అటవీ అధికారి సంజయ్ నాయక్ ఆత్మహత్యపై ఆ శాఖ విచారణకు ఆదేశించింది. దీనికి సిల్వికల్చర్ విభాగ రాయగడ డీఎఫ్‌వో దేబేంద్ర బెహరా కారణమన్న ఆరోపణలు అటవీశాఖ తీవ్రమైనవిగా తీసుకుంది. దీనికితోడు నాలుగు రోజుల కిందట రాయగడ పర్యటనకు వచ్చిన అటవీశాఖ మంత్రి గణేష్ రాంసింగ్ ఖుంటియా బాధిత కుటుంబాన్ని కలిసి భరోసా ఇచ్చిన నేపథ్యంలో ఈ కేసు ప్రాముఖ్యత సంతరించుకుంది. దీంతో శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) దేబదత్త బిశ్వాల్ మీడియాకు తెలిపారు. ముఖ్య అటవీ సంరక్షకుడి హోదా అధికారి నేతృత్వంలో విచారణ కొనసాగుతున్నట్లు బిశ్వాల్ మీడియాకు వెల్లడించారు. డీఎఫ్‌వో దేబేంద్ర మానసిక వేధింపుల వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆయన స్పష్టం చేశారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.


సంజయ్ నాయక్

లేఖలో ఏముంది: పోలీసులు స్వాధీనం చేసుకున్న లేఖలో డీఎఫ్‌వో లంచాలు కోసం తీవ్రంగా వేధించేవారని, గతేడాది దేబేంద్రకు రూ.7లక్షలను, ఈ ఏడాది గణేష్ పూజా సమయంలో రూ.3.5 లక్షలను చెల్లించానని లేఖలో సంజయ్ రాసినట్లు సమాచారం. అంతేకాకుండా 40 వేలు విరాళాన్ని చెల్లించినట్లు అందులో పేర్కొన్నట్లు తెలిసింది. తరచూ ఇలా లంచాల కోసం వేధిస్తుండడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు లేఖలో ఉన్నట్లు తెలుస్తోంది.

4 వేలకుపైగా దగ్గుమందు సీసాలు స్వాధీనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: బరగఢ్ పోలీసులు సోమవారం సాయంత్రం 4 వేలకు పైగా దగ్గుమందు సీసాలను స్వాధీనం చేసుకొని, 17 మందిని అరెస్టు చేశారు. బరగఢ్ ఎస్పీ ప్రహ్లాద్ మీనా మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులు కోల్‌కతా నుంచి బరగఢ్‌కు పికప్ వ్యానులో తరలిస్తున్న 4,475 దగ్గుమందు సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి 17 మందిని అరెస్టు చేయగా, 16 మంది జిల్లాకు చెందిన వారుకాగా, ఒకరు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌కు చెందినవాడు. నిషేధిత సామగ్రి వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించి, బౌడెన్ వైపు కాలువా రణదారిలో పికప్‌వ్యానులో 30 పెట్టెలు గుర్తించారు. అందులో 4,475 దగ్గుమందు సీసాలు, 120 నీటి సీసాలు, కల్తీమద్యం తదితరాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై విచారణ కొనసాగుతున్నట్లు పేర్కొన్న ఎస్పీ ప్రహ్లాద్ ఈ ఏడాదిలో ఇంతవరకు మాదక ద్రవ్యాల నిషేధిత చట్టం కింద 147 మందిని అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 806 కిలోలకు పైగా గంజాయి, 18 వేలకుపైగా దగ్గుమందు సీసాలు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న దగ్గు మందు సీసాలు

బీఎస్‌ఎఫ్ క్యాంప్ రద్దు చేయొద్దు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: జంత్రి పంచాయతీలో ఉన్న బీఎస్‌ఎఫ్ క్యాంప్ రద్దు చేయొద్దని ప్రజలు డిమాండ్ చేశారు. మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వాభిమాన్ ప్రాంతంలో పలు గ్రామాల ప్రజలు మంగళవారం ప్రజామేళ నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గత 15 ఏళ్ల క్రితం చిత్రకొండ సమితి మావోయిస్టుల అడ్డాగా ఉండేదన్నారు. 2015లో జంత్రిలో బీఎస్‌ఎఫ్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో చాలా మంది మావోయిస్టులు అరెస్టయ్యారు. కొంతమంది లొంగిపోగా, మరికొందరు ఈ ప్రాంతం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోయారు. బి.ఎస్.ఎఫ్. జవాన్లు తమ ప్రాంతానికి రక్షణ కవచంగా ఉన్నారని, ఎన్నో అభివృద్ధి పనులు చేశారన్నారు. 2018లో గురుప్రియ వంతెన నిర్మాణమైన తరువాత రహదారి, ఆరోగ్య కేంద్రం సౌకర్యాలు కలిగాయన్నారు. బీఎస్‌ఎఫ్ క్యాంపులు తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ఇటీవల ప్రకటించడంతో దీన్ని ఇక్కడే ఉంచాలని కోరుతున్నారు. ఈ క్యాంప్ తొలగిస్తే మళ్లీ మావోయిస్టులు ఇక్కడ పాగా వేసి తమపై దాడి చేసే అవకాశం ఉందన్నారు. అందువల్ల మరో ఐదేళ్లు క్యాంపు ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు కమాండెంట్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. కలిమెల, మత్తిలి, చిత్రకొండ, ఖైర్పుట్, పోడియా, మల్కాన్ గిరి సమితుల్లో మొత్తం 18 బి.ఎస్.ఎఫ్. క్యాంపులు ఉండగా, వీటిలో ఆరు చిత్రకొండలోనే ఉన్నాయి.


ప్రజామేళాలో పాల్గొన్న పంచాయతీ వాసులు

మట్టి ఇంట్లో అంగన్‌వాడీ కేంద్రం

కొరాపుట్, న్యూస్‌టుడే: చిన్నారుల భవితకు అంధకారం అలముకుంది. అధ్వాన భవనాల్లోనే కాలం వెళ్లదీయాల్సి పరిస్థితి. అంగన్‌వాడీ కేంద్రాలు నడిపేందుకు శాశ్వత భవనాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం పిల్లల భవితపై ప్రభావం చూపుతోంది. కొరాపుట్ జిల్లా దశమంతపూర్ సమితికి చెందిన ఎ.మల్కాన్‌గిరి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేదు. దీంతో గ్రామంలోని ఓ మట్టి ఇంటిలో కేంద్రం నడుపుతున్నారు. ఇందులో 20 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. వర్షం వస్తే ఆ రోజు కేంద్రం నడిపేందుకు అవకాశం ఉండడం లేదని కార్యకర్త తలిషా హల్వా చెప్పారు. మట్టి గోడలు కావడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. సరైన వసతులు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామస్థులు, కార్యకర్త పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం. దీనిపై సబ్‌కలెక్టర్ వేణుధర్ సబర్‌ను అడగ్గా శాశ్వత భవనం నిర్మాణానికి త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.


భోజనాలు చేస్తున్న చిన్నారులు

మహనీయుల బాట అనుసరణీయం: మోహన్


ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి


పాల్గొన్న వివిధరంగాల ప్రముఖులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: దేశానికి, రాష్ట్రానికి విశిష్ట సేవలందించిన మహనీయుల బాట అనుసరణీయమని, వారి అడుగు జాడల్లో పయనిద్దామని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి పేర్కొన్నారు. సోమవారం రాత్రి భువనేశ్వర్‌లో స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రముఖ రచయిత ఆచార్య జగన్నాథ పట్నాయక్ 22వ వర్ధంతి కార్యక్రమం ప్రముఖుల సమక్షంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామం, స్వతంత్ర ఒడిశా ఉద్యమాల్లో పాల్గొన్న వారిసేవలను ప్రస్తుతించారు. జగన్నాథ పట్నాయక్‌ను ఉత్కల వరపుత్రునిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన సమర యోధుల జీవిత విశేషాలతో ముద్రించిన పుస్తకాన్ని విడుదల చేశారు.

అలరించిన సాంస్కృతికోత్సవాలు


శాస్త్రీయ నృత్యంలో అలరించిన కళాకారులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కేంద్రం ఛత్రపురంలోని మైదానంలో ఏర్పాటైన 'వికాస్ మేళా'లో సోమవారం రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకుల్ని అలరించాయి. ప్రిన్స్ నృత్య బృందం, మా దేవీ నాట్య సంసద్ (మహానాళ), నృత్యం (హింజిలి), ఒడిస్సీ నృత్యం (బ్రహ్మపుర) తదితర సంస్థల కళాకారులు ఆధునిక, శాస్త్రీయ నృత్యాలతో మెప్పించారు. జానపద కళారూపం భరతలీల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గాయనీ, గాయకులు రోనాలిసా, జితేంద్ర, జితురాజ్, పింకి, బిచిత్ర, దిలీప్ తదితరులు హుషారెక్కించే గీతాలతో ఉర్రూతలూగించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా వికాస్ మేళా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.


ప్రిన్స్ నృత్య బృందం ప్రదర్శన

ఆల్బం తార మృతిపై ఫిర్యాదు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఆల్బం తార రువానినా బనో ఇటీవల భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. కలహండి జిల్లా భవానిపట్నంకు చెందిన రువానినా కొద్దిరోజుల క్రితం బొలంగీర్ జిల్లాలో చిత్రీకరణ (షూటింగ్)కు వెళ్లింది. తిరిగొచ్చిన తరువాత అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ నేపథ్యంలో ఆమె తల్లిదండ్రులు సోమవారం భవానీపట్న ఠాణాలో ఫిర్యాదు చేశారు. చిత్రీకరణ సమయంలో ఆమెకు గాయకుడు రుకు సునా, ఆయన సన్నిహితులు స్లో పోయిజన్ ఇచ్చారని, అందువల్లే మృతి చెందిందని పేర్కొన్నారు. దీనిపై ఠాణా అధికారులు వివరణ ఇవ్వలేదు.


రువానినా బనో

1.28 లక్షల మందికి బీసీజీ టీకాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 1.28 లక్షల మందికి బీసీజీ టీకాలు వేయాలని లక్ష్యం నిర్దేశించినట్లు జిల్లా ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్ అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి బీసీజీ టీకాల అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్షయవ్యాధి నివారణకు ఈ టీకాలు దోహదపడతాయన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించి క్రమబద్ధీకరణ చికిత్స అందించడం ద్వారా దీన్ని నివారించవచ్చన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని ఆయా ప్రాంత ఆశా, ఆరోగ్య కార్యకర్తలు గుర్తించి టీకాలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మమతాసాహు, పి.కె.సుబుద్ధి, చిన్మయ్ బెహరా, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు హాజరయ్యారు.


మాట్లాడుతున్న లాల్ మోహన్. వేదికపై అతిథులు

సమస్యలు పరిష్కారం కాకుంటే నిరసన

బీఈఎంసీ కార్పొరేటర్లలో అసంతృప్తి సెగలు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ)లోని వార్డుల్లో పనులు ముందుకు సాగడం లేదని, సమస్యలు పెరుగుతున్నాయని, పరిష్కారం మాత్రం కావడం లేదని బీఈఎంసీ కార్పొరేటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ వార్డుల్లో రహదారులు, కాలువల పనులు, విద్యుత్తుదీపాలు, రేషన్ కార్డులు, రాజీవ్‌ఆవాస్ గృహాలు, సౌచాలయాల నిర్వహణ తదితర పనులు జరగడం లేదని, పనుల వర్క్‌ఆర్డర్లు కూడా ఇవ్వడం లేదని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. వీటన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ పలువురు కార్పొరేటర్లు మంగళవారం బీఈఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్‌మిశ్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ దసరా పండగలోగా రహదారులు, కాలువలు పనులు, వీధిదీపాల ఏర్పాటు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని డిమాండు చేశారు. సమావేశాల్లో పనులపై నిర్ణయం తీసుకుంటున్నా అవి ఎందుకు అమలు కావడంలేదని, సంబంధిత విభాగాల ఈఈలు, జేఈలు నిర్లక్ష్యంగా ఎందుకు వ్యవహరిస్తున్నారని వారు కమిషనర్‌ను ప్రశ్నించారు. గుత్త ప్రక్రియ పూర్తయినా కూడా పలువార్డులలో పనులెందుకు ప్రారంభించడంలేదని వారు ప్రశ్నించారు. కార్పొరేటర్లు జమ్ముల శ్రీనివాస్, దుర్గాకుమార్ లాయక్, త్రిపతిపాత్ర్, సమీర్‌కుమార్ మిశ్ర, రంజితా బెహరా తదితరులు మాట్లాడుతూ బ్రహ్మపురలో చాలా సమస్యలున్నాయని, వాటిలో కొన్నింటినే కమిషనరు దృష్టికి తీసుకొచ్చామని వారు చెప్పారు. ఇవన్నీ వారం రోజుల్లోగా పరిష్కరించకుంటే బీఈఎంసీ ఆవరణలో ధర్నా చేపడతామని వారు చెప్పారు.


కమిషనర్ మిశ్రకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్లు

ఏనుగు దాడిలో ఇద్దరి మృతి, ముగ్గురి పరిస్థితి విషమం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఏనుగుల దాడిలో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన మయూర్‌భంజ్ జిల్లాలో సువియాపొదర ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. రెండు రోజుల వ్యవధిలో రెవులి, రాస్‌గోవింద్‌పూర్, బెత్నోటి అటవీ రేంజ్ పరిధిలో ఓ ఏనుగు బీభత్సం సృష్టించింది. పశ్చిమబెంగాల్ సరిహద్దు ప్రాంతంలో సంచరిస్తున్న ఇది దాడి చేయడంతో సోమవారం సోన్‌పురియా గ్రామానికి చెందిన రఘునాథ్ హేంబ్రం, మోరాడ ఠాణా పరిధి గోలముహ పంచాయతీ ఉవిడిష గ్రామానికి చెందిన తురం హేంబ్రం భార్య సక్ర హేంబ్రం దుర్మరణం చెందారు. పొఖారియా గ్రామానికి చెందిన లుసకి సోరెన్, తడకి గ్రామానికి చెందిన సర్వేశ్వర్‌సింగ్‌తో పాటు అనువ గ్రామానికి చెందిన సుగమహంతలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

80 మంది గర్భిణుల తరలింపు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఇటీవల వరదల వల్ల పశ్చిమ మిద్నాపూర్ జిల్లాలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. అప్రమత్తమైన యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మూడు రోజుల్లో 80 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. అనంతరం ఘటాల్, కేస్పూర్, డేబ్రా ఆసుపత్రుల్లో చేర్పించినట్లు సోమవారం ఓ ప్రకటనలో చెప్పారు.


గర్భిణిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న స్థానికులు

మెగా రక్తదాన శిబిరం

పర్లాఖెముండి, గుణుపురం, న్యూస్‌టుడే: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో పట్టణంలోని బిజు కళ్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పాలనాధికారి బిజయ్‌కుమార్ దాస్ ప్రారంభించిన ఇందులో 72యూనిట్ల రక్త సేకరించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, సబ్ కలెక్టర్ అనూప్ పండా, తహసీల్దార్ నారాయణ బెహరా, జిల్లా సమాచార శాఖ అధికారి ప్రదీప్త గుర్మయ్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, పక్కన పాలనాధికారి దాస్


602 యూనిట్ల రక్తం సేకరణ


శిబిరంలో బీడీవో సుబ్రాంజలి ప్రధాన్, జీఐఈటీ రిజిస్ట్రార్ ఎన్‌వీజే రావు

గుణుపురం జీఐఈటీ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని బీడీఓ సుబ్రాంజలి ప్రధాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీఐఈటీ రిజిస్ట్రార్ ఎన్‌వీజే రావు, వైస్ ఛాన్సలర్ ఏవీఎల్ఎన్ శర్మ, డీన్ ఎ.బి. శ్రీనివాస రావు, ఎన్ఎస్ఎస్ అధికారులు బాణీ ప్రసాద్ నాయక్, గణేశ్వర పృష్టి, ప్రేమాంశు శేఖర్ రథో తదితరులు పాల్గొన్నారు. ఇందులో బ్రహ్మపురం రక్తనిధి కేంద్రం 302, రాయగడ 200, గుణుపురం 100 యూనిట్ల రక్తం సేకరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు మోహన్ సత్కారం

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఉపాధ్యాయ దినోత్సవం నాడు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా ఉత్తమ గురువులుగా సత్కారం అందుకున్న ఇద్దర్ని మంగళవారం ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సన్మానించారు. లోక్‌సేవాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ద్యుతిచంద్రసాహు, సంతోష్‌కుమార్ కొరొలకు కండువా, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహుజా, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సంతోష్‌ను సన్మానిస్తున్న మోహన్. పక్కన మనోజ్

కర్ర వంతెనే దిక్కు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: ఝార్‌గ్రామ్ జిల్లా చాందబిలా, పంచమి గ్రామాల మధ్యం పుతురంగి ఏరుతో ఏరుపై రాకపోకలకు తరచూ ఇబ్బంది ఎదురయ్యేది. వంతెన నిర్మించాలని అధికారులను కోరినా ఫలితం లేకపోవడంతో గతంలో దీనిపై కర్ర వంతెన ఏర్పాటు చేసుకున్నారు. అదికాస్త ఇటీవల వరదలకు కొట్టుకుపోయింది. జాంబోని సమితి, ఝార్‌గ్రామ్ మధ్య రాకపోకలు నిలిచిపోయి విద్యార్థులు, రోగులు అవస్థలు పడుతున్నారు. చేసేది లేక మంగళవారం చాంద్‌బిలా, పంచమి గ్రామాల ప్రజలు మళ్లీ కర్ర వంతెన నిర్మించుకున్నారు. 2018 నుంచి వంతెన నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.


కర్ర వంతెన నిర్మిస్తున్న స్థానికులు

నదులను కలుషితం చేయొద్దు

'నదులను కలుషితం చేయొద్దని, తీర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని నేవల్ కేడెట్లు నినాదాలు చేశారు. ప్రపంచ నదుల దినం సందర్భంగా మంగళవారం గంజాంలోని రుషికుల్య నదీ తీరంలో పేరుకుపోయిన చెత్తచెదారాలు తొలగించి శుభ్రపరిచారు. -న్యూస్‌టుడే, బ్రహ్మపుర బజారు



సంక్షిప్త సమాచారం

★ **భువనేశ్వర్:** భువనేశ్వర్ కేపిటల్ ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం నుంచి పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు.

★ **బ్రహ్మపుర నగరం:** సామాజిక, సాంస్కృతిక రంగాల్లో సేవ, ఇతర కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని 'మహాన్ సంఘ్' అధ్యక్షుడు సుశాంత్ కుమార్ సాబత్ పిలుపునిచ్చారు. మహాన్ సంఘ్ 40వ వార్షికోత్సవాల నిర్వహణపై స్థానిక ఓ హోటల్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటైంది.

★ **బ్రహ్మపుర నగరం:** స్వామి చిదానంద సరస్వతీ మహారాజ్ 108వ జయంత్యుత్సవాల సందర్భంగా మంగళవారం లంజిపల్లిలోని వీర హనుమాన్ మందిరం ఆవరణలో ఆధ్యాత్మికవేత్త స్వామి హరిశరణానంద సరస్వతీ ఆధ్వర్యంలో జయ గణేష్ కీర్తన, జపం, శ్రీసూక్తం, విశ్వ ప్రార్థన తదితరాలు నిర్వహించారు.

★ **భువనేశ్వర్:** బొలంగీర్ జిల్లా కంటాబంజి ఠాణా 59వ రహదారి చెరువులో మంగళవారం ఇద్దరి మృతదేహాలు తేలియాడుతున్న వైనం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక జవానులు మృతదేహాలను వెలికి తీశారు. దర్యాప్తు కొనసాగుతోంది.

★ **భువనేశ్వర్:** కటక్‌లోని జగత్‌పూర్ ఠాణా అటాడ వద్ద కల్తీపాలు, పెరుగు, లస్సీ తయారీ కేంద్రాన్ని పోలీసులు సోమవారం రాత్రి సీజ్‌చేశారు. రోహిణి బ్రాండ్ పేరిట అంగడిలో విక్రయాలు జరుగుతున్న పాలు, పెరుగులో నాణ్యతా ప్రమాణాలు లేవు. కల్తీ చేస్తున్నారన్న అభియోగం మేరకు కమిషనరేట్ పోలీసులు, ఆహారశాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి పరిశీలించారు.

★ **భువనేశ్వర్:** భువనేశ్వర్‌లోని భరత్‌పూర్ ఠాణాలో మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. 25 కెమెరాలు అమర్చాల్సి ఉండగా ప్రస్తుతానికి 16 ఏర్పాటయ్యాయి.

★ **సిమిలిగుడ:** స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సిమిలిగుడ సమితి మనియా, దొలాయిగుడ గ్రామాల్లో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. జేపీ హైస్కూల్ ఎకో, ఎనర్జీ క్లబ్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

★ **పర్లాఖెముండి:** గుసాని సమితి దవిడిగాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం వ్యవసాయ విద్యార్థులు మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు సంధ్యారాణి మహారణా, విద్యార్థులు సాయి మేఘన, బి.మేఘన చౌదరి, పి. శ్రీవిద్య, కె.భవ్యశ్రీ పాల్గొన్నారు.

★ **సిమిలిగుడ:** చేపల పెంపకంపై మత్స్య విభాగం ప్రోత్సాహాన్ని అందిస్తుందని నారీశక్తి ఫార్మర్ ప్రొడ్యూసర్స్ సంస్థ డైరెక్టర్ మణి బోయి అన్నారు. నందపూర్ సమితి మాలి బెల్‌గావ్‌లో ఆ సంస్థ మంగళవారం చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. నందపూర్, లమతపుట్ సమితిలకు చెందిన 33 మంది రైతులకు చేప పిల్లలు అందజేశారు. సంస్థ సీఈవో మంగరాజు దొర, క్షేత్ర అధికారి నకుల్ నాయక్ పాల్గొన్నారు.

★ **నవరంగపూర్:** నవరంగ్‌పూర్ జిల్లా రాయ్‌ఘర్ సమితిలో పాలనాధికారి శుభంకర్ మహాపాత్ర్ నేతృత్వంలో మంగళవారం వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. 28 ఫిర్యాదులు అందాయి. సామాజిక సురక్షా విభాగం తరఫున అయిదుగురు దివ్యాంగులకు చక్రాల కుర్చీలు అందజేశారు. సీడీవో బిరంచి నారాయణ్ సబ్ కలెక్టర్ ప్రకాష్ మిశ్ర, ఎస్‌డీపీవో మధుసిక్త మిశ్రా, బీడీవో లక్ష్మీసాగర్ మాఝి పాల్గొన్నారు.

★ **పర్లాఖెముండి:** పర్లాఖెముండి పట్టణంలోని 16 వార్డుల్లో మంగళవారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు, యువజన అధ్యక్షుడు బాలకృష్ణ పాత్ర్, పట్టణ అధ్యక్షుడు వసంత్ కుమార్ తదితరులు పాల్గొని పలువురికి సభ్యత్వం నమోదు చేశారు.

కౌసల్ వికాస్ యాత్రపై చైతన్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఇస్లెక్ట్ ఒడిశా శాఖ ఆధ్వర్యంలో సిమిలిగుడ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం కౌసల్ వికాస్ యాత్రపై చైతన్య కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఇస్లెక్ట్ కొరాపుట్ జిల్లా కోఆర్డినేటర్ శివనారాయణ పటేల్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఈ నెల 11 నుంచి అక్టోబర్ 4వ వరకు దేశంలోని 22 రాష్ట్రాల్లోని సుమారు 3 వేల జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కొత్తవిద్యా విధానం, భవిష్యత్తు కార్యాచరణపై విద్యార్థులకు చైతన్యం కలిగిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ పథకాల గురించి అవగాహన కలిగిస్తున్నామన్నారు. అధ్యాపకురాలు విద్యుత్ ప్రభరథ్, ప్రధానాచార్యులు రామా రంజాన్ పట్నాయక్, సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అరుణ్ కుమార్‌సాహు, రాష్ట్ర ప్రాజెక్ట్ మేనేజర్ అరుణ్ కుమార్ సాహు, రాష్ట్ర నియామక మేనేజర్ బిశ్వరంజన్ బెహరా, మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్ స్టూడెంట్ ఆర్గనైజర్ పార్థమన్ సాహు పాల్గొన్నారు.



విద్యార్థుల ర్యాలీ

పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవితం


గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు నిర్వహిస్తున్న మహిళలు, ఉద్యోగులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఉత్కళ అల్యూమినా పరిశ్రమ మంగళవారం స్వచ్ఛత అభియాన్‌కు అనూహ్య స్పందన లభించింది. కాశీపూర్ సమితి కుచేయిపొదర్‌లో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ప్రోగ్రాం కింద దీన్ని నిర్వహించారు. పరిసర ఐదు గ్రామాల్లో అక్టోబర్ 2 వరకు కొనసాగించనున్నట్లు పరిశ్రమ అధికారులు మీడియాకు వెల్లడించారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చంటూ చైతన్య ర్యాలీ నిర్వహించారు. త్వరలో చైతన్య రథాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. దొరాగుడ పోలీస్‌స్టేషన్ ఎస్సై సరితా సేత్, ఉత్కళ అల్యూమినా అధికారులు పరంజిత్ బాజ్వా, కిరణ్‌నాయక్, చందన్ కిషోర్, లోపాముద్ర మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

గుణుపురంలో ముగింపు.. గుడారిలో ప్రారంభం.. గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలో ప్రసిద్ధ బాలి జాతర గుణుపురంలో సోమవారం రాత్రితో ముగియగా, మంగళవారం నుంచి గుడారిలో ప్రారంభమైంది. గుణుపురంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించారు. చివరి రోజు బెజ్జు(పూజారి) మట్టి కుండ, మేకులు కొట్టిన బల్లపై నిల్చుని భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చే ఘట్టం చేపట్టారు. అనంతరం నిప్పులపై నడిచే కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా పద్మపురం సమితి నువాగడ పంచాయతీలో మంగళవారం ఉదయం గుణుపురం ఎమ్మెల్యే సత్యజిత్ గమాంగ్, సమితి ఎంపీ ప్రతినిధి ఎం.సురేష్ కుమార్ పర్యటించారు. సర్పంచి మమితా మాఝి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అర్హత ఉన్న వారికి పింఛన్లు, సుభద్ర యోజనా సాయం, అన్ని గ్రామాలకు రహదారులు, తాగునీరు, వైద్య సౌకర్యం అందేలా చూడాలని కోరారు. తన పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.


ఎమ్మెల్యే సత్యజిత్‌కు వినతిపత్రం ఇస్తున్న సర్పంచి మమితా

అంతర్‌జిల్లా ఫుట్‌బాల్ పోటీలకు గంజాం జట్టు


పోటీలకు వెళ్లిన జిల్లా జట్టు క్రీడాకారులు. పక్కన శిక్షకుడు, మేనేజరు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: పరదీప్‌లో ఈ నెల 25వ తేదీ నుంచి అక్టోబరు 6 వరకు జరగనున్న 63వ సీనియర్ పురుషుల అంతర్ జిల్లా ఫుట్‌బాల్ పోటీల (సహాని కప్-2024-25)కు గంజాం జిల్లా జట్టు సిద్ధమైంది. ఈమేరకు జిల్లా జట్టు క్రీడాకారులు మంగళవారం పరదీప్‌కు బయలుదేరారు.

ముగిసిన క్రీడా పోటీలు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగ్‌పూర్‌లో గత రెండు రోజులుగా అటవీశాఖ తరఫున జరుగుతున్న క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముఖ్య అతిథులుగా భవానీపట్న, కొరాపుట్ ఆర్‌సీసీఎఫ్‌లు సంతోష్‌జోషి, ప్రసన్న కుమార్ బెహరా హాజరయ్యారు. 400 మందికి పైగా ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నారు. పరుగు, లాంగ్‌జంప్, తాడులాగడం, ఇండోర్ గేమ్స్, బ్యాడ్మింటన్, చదరంగం, టేబుల్ టెన్నిస్ నిర్వహించారు. విజేత, రన్నరప్ జట్లకు జ్ఞాపికలు అందజేశారు. కొరాపుట్, జయపురం, నవరంగ్‌పూర్ జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.




జ్ఞాపికలతో విజేత, రన్నరప్ జట్లు

నిందితుల అరెస్టు

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగ్‌పూర్ జిల్లా టెంటులిఖుంటి సమితిలో వారం రోజుల క్రితం 11 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్యచేసిన కేసులో పోలీసులు మంగళవారం ఇద్దరిని అరెస్టు చేశారు. నిందితులు కంటగావ్ గ్రామానికి చెందిన అలేఖ్ మాఝి, పరమానంద్ దిశారిగా గుర్తించారు. ఇద్దరూ మద్యం మత్తులో బాలికపై అత్యాచారం చేశామని పోలీసులకు చిక్కుతామనే భయంతో హత్యచేసినట్లు అంగీకరించారని ఐఐసీ సంబిత్ కుమార్ తెలిపారు. నిందితులను కొరాపుట్ జైలుకు తరలించారు.

పట్టుబడిన ట్రాప్ కెమెరా చోరుడు


అరెస్టు అయిన నిందితుడు

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి సోమనాథ్‌పూర్ పంచాయతీ పరిధి అడవిలో వన్యప్రాణుల రాకపోకలు గమనించేందుకు పెట్టిన ట్రాప్ కెమెరా చోరీకి గురైంది. జూన్ 19న పిలాకుసుమి గ్రామానికి చెందిన బుదు పుజారి కర్రలు కోసం వెళ్లగా కెమెరా కనిపించడంతో దాన్ని దొంగిలించాడు. దీనిపై బలిమెల అటవీ అధికారులు ఠాణాలో ఫిర్యాదు చేయగా దర్యాప్తు ప్రారంభించారు. సోమవారం పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, కెమెరా స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం న్యాయస్థానానికి తరలించారు.

ఆరోగ్య కార్యకర్తపై దాడి.. తర్వాత ఆత్మహత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: కొంధమాల్ జిల్లా కె.నువాగావ్ ఠాణా పరిధిలోని కుడుతులి ఆరోగ్య ఉప కేంద్రంలో మహిళా ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న సుచిస్మిత బెహరాపై సోమవారం ఆమె ఉంటున్న క్వార్టర్‌లో జగన్నాథ బెహరా అనే వ్యక్తి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం అదే ఇంట్లో ఆయన పైకప్పునకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సుచిస్మితను స్థానికులు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ ఘటనకు కారణాలు తెలియరాలేదు.

పాఠశాలపై పిడుగు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ జిల్లా అరాగడ్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం తరగతులు కొనసాగుతున్న తరుణంలో పిడుగు పడింది. గది గోడలు బీటలు వారాయి. మధ్యాహ్న భోజనం వంటలకు సహాయం చేసే మహిళ గాయపడడంతో ఆమెను ఆసుపత్రిలో చేర్చారు.

నూనెల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: పెద్దబజారు ఠాణా పరిధిలో గణపతినగర్ ఐదో లైనులోని ఓ ఇంట్లో నూనెల తయారీ కేంద్రంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. వివిధ బ్రాండ్ల కల్తీ నూనె తయారీ జరుగుతోందన్న ఆరోపణలపై పోలీసులు ఈ దాడులు చేశారు. పూర్తి వివరాలింకా తెలియాల్సి ఉంది.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో బబుల్లి నాయక్, పక్కన ఐఐసీ ఉత్తమ్ కుమార్

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా గుణుపురం పోలీసులు గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్‌డీపీవో బబుల్లి నాయక్ మాట్లాడుతూ గుణుపురంలో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ వ్యాన్ వేగంగా వెళ్లడంతో దాన్ని వెంబడించి, ఖొర్లింగి ఆర్ఎంసీ చెక్ గేటు వద్ద పట్టుకున్నారు. వాహనం తనిఖీ చేయగా అందులో గంజాయి బస్తాలు గుర్తించారు. వ్యాన్‌తోపాటు 525 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడు గజపతి జిల్లా గులబా పంచాయతీ సుండిపిండా గ్రామానికి చెందిన జిత్తు నాయక్‌ను అరెస్టు చేశారు. గంజాయి గజపతి జిల్లా నుంచి ఆంధ్రా వైపునకు వెళ్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహు, ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ పాఢి ఉన్నారు.

సమ్మెకు నర్సింగ్ అధికార సంఘం పిలుపు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్ర నర్సింగ్ అధికారిణుల సంఘం బుధవారం నుంచి గురువారం వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో సమ్మె చేయడానికి పిలుపునిచ్చింది. తమ 10 డిమాండ్లపై ప్రభుత్వం దృష్టిసారించనందున ఆందోళన నిర్ణయం తీసుకున్నట్లు సంఘం అధ్యక్షురాలు సుచిస్మితదాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు సమ్మె చేస్తే 'ఎస్మా' ప్రయోగిస్తామని నర్సింగ్ సంచాలకుని కార్యాలయం (డైరెక్టరేట్) అధికార వర్గాలు హెచ్చరించాయి.

అంతర్గత సలహా కేంద్రాలు ప్రారంభించాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఉన్నత విద్యా సంస్థల్లో విద్యార్థులు, ఆచార్యులు, బోధనేతర సిబ్బంది ఇబ్బందుల అధ్యయనానికి అంతర్గత సలహా కేంద్రాలు ప్రారంభించాలని విశ్వవిద్యాలయ విత్త సంస్థ గతేడాది ఆదేశించింది. 16 వర్సిటీలు, 822 కళాశాలలకు గాను సగం విద్యాసంస్థలు ఈ ఉత్తర్వులు అమలు చేయలేదు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యా శాఖ మంగళవారం విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు లేఖలు రాసింది. ఈ నెల 30లోగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

క్యాన్సర్ రోగులకు కేశదానం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: కీమోథెరపీ చేయించుకున్న క్యాన్సర్ రోగులకు జుట్టు ఊడిపోతుందన్న విషయం తెలిసిందే. వారి కోసం మిద్నాపూర్ పట్టణానికి చెందిన 46 మంది మహిళలు సోమవారం కేశదానం చేశారు. మిద్నాపూర్ పట్టణ రవీంద్ర నగర్ ప్రాంతంలో అపరాజయ్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ గైనకాలజిస్ట్ మంగళ్ ప్రసాద్ మల్లిక్, ఆచార్య అమర్ సహ, ఉపాధ్యాయుడు దిపేస్ దే పాల్గొన్నారు.

ఠాణాకు చేరిన బిజద తగవు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నగర బిజద నేతల మధ్య తగవులు ముదిరి పాకాన పడ్డాయి. ఠాణా వరకు చేరాయి. ఎన్నికల నుంచి మొదలైన కలహాలు ఇటీవల కాలంలో రచ్చకెక్కాయి. విషయం అధినేత నవీన్ పట్నాయక్‌కు తెలిసినా మౌనంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం శంఖభవన్‌లో సర్దుబాటు చర్చలు జరిగినా ఫలితమివ్వలేదు. నగరపాలక సంస్థ కార్పొరేటర్లు అమరేష్ జెనా, బిరించి మహా సుపుకార్, మాజీ మంత్రి అశోక్‌చంద్రపండా, భువనేశ్వర్ ఉత్తర శాసనసభ్యుడు అనంతనారాయణ్ జెనా మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై జెనా, సుపుకార్ మంగళవారం పండా, అనంతనారాయణ్‌లపై ఠాణాల్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

సునాబెడ అభివృద్ధికి కృషి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ పురపాలక అభివృద్ధికి కృషి చేస్తానని సీఎల్పీ నేత, పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం అన్నారు. మంగళవారం ఇక్కడికి వచ్చిన ఆయనకు ఘనస్వాగతం పలికి పురపాలక ఆధ్వర్యంలో సత్కరించారు. అందరూ కలిసి పనిచేసి ఆదర్శ పురపాలికగా తీర్చి దిద్దాలన్నారు. అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర, ఉపాధ్యక్షురాలు రీతు కంట, కౌన్సిలర్లు, కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కడంను సత్కరిస్తున్న పురపాలక అధికారులు

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: భువనేశ్వర్ కమిషనరేట్ పరిధిలోని భరత్‌పూర్ ఠాణాలో ఆర్మీ మేజరు, ఆయనకు కాబోయే భార్యపై జరిగిన ఘటనకు బాధ్యులైన వారందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆప్ డిమాండు చేసింది. ఆ పార్టీ గంజాం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బ్రహ్మపుర ఎస్పీ కార్యాలయం బయట ప్రదర్శన నిర్వహించారు.



విజన్ డాక్యుమెంటు రూపకల్పనకు అడుగులు


సమావేశంలో ప్రధాన కార్యదర్శి మనోజ్, డీసీ అనుగార్గ్, అధికారులు, నిపుణులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్ర ప్రగతి రథ చక్రాలు పరుగులు తీయిస్తామని పునరుద్ఘాటిస్తున్న భాజపా పాలకులు 'వికసిత్ ఒడిశా' విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు సన్నద్ధమయ్యాయి. ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా అధ్యక్షతన ప్రభుత్వం ఏర్పాటుచేసిన నిపుణులు సంఘం ఈ దిశగా సన్నాహాలు ప్రారంభించింది. సోమవారం రాత్రి లోక్ సేవా భవన్‌లో సంఘం ప్రతినిధులంతా తొలి సమావేశం చేపట్టారు.

2036 నాటికి లక్ష్య సిద్ధి...

1936 ఏప్రిల్ 1న స్వతంత్ర ఒడిశా ఏర్పాటైంది. 2036 నాటికి వందేళ్ళు పూర్తవుతుంది. ఈ వ్యవధిలోగా వికసిత్ ఒడిశా అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలన్న లక్ష్యసాధనకు ఎలా అడుగులు వేయాలి అన్న అంశంపై సీఎస్ అధ్యక్షతన సంఘం సమగ్ర నివేదిక రూపకల్పన చేస్తుంది. మోహన్ చరణ్‌మాఝి సర్కారు వ్యవసాయం, పరిశ్రమలు, రైల్వే, రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, ఎగుమతులపై దృష్టి సారించింది. ఈ రంగాల్లో అభివృద్ధి సాధిస్తే వికసిత్ ఒడిశా ధ్యేయం నెరవేరుతుందన్న ఆశాభావంతో ఉంది. ఇటీవల సీఎస్, ప్రభుత్వశాఖల ప్రిన్సిపల్ కార్యదర్శులతో ఇటీవల మోహన్ సమావేశమైన సంగతి తెలిసిందే. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ఇందులో నిర్ణయమైంది.

నీతి ఆయోగ్ ఆమోదంతో...

ఈ నివేదిక సిద్ధమైన తరువాత నీతి ఆయోగ్‌కు పంపిస్తారు. అది ఆమోదించిన అనంతరం సమగ్ర కార్యాచరణ ప్రారంభం కానుంది. రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తుందని, ఇది మోదీ గ్యారంటీగా ప్రధాని పునరుద్ఘాటిస్తున్న సంగతి తెలిపింది.

కొద్దిరోజుల్లో నివేదిక.. సోమవారం రాత్రి సమావేశం తరువాత అభివృద్ధి కమిషనర్ (డీసీ) అనూగార్గ్ విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజుల్లో విజన్ డాక్యుమెంట్ నివేదిక సిద్ధం కానుందన్నారు. దీనిపై పూర్తి వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు.

బడిదేవర కొండపై తవ్వకాలు వద్దు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలంలోని బడిదేవర కొండను చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పూజిస్తారని, దానిపై తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి కోరారు. మంగళవారం గిరిజనులతో కలిసి కలెక్టరేట్, అటవీశాఖ కార్యాలయాల వద్ద ధర్నా చేశారు. 2017లో అటవీ ప్రాంతంగా ఉన్న కొండ 2024లో జిరాయితీగా ఎలా మారిందని ప్రశ్నించారు. కొండ పోడు చేసే గిరిజనులపై ఆంక్షలు విధించి, తవ్వకాలకు ఎలా అనుమతులు ఇస్తారన్నారు. ఇన్‌ఛార్జి డీఆర్వో కేశవనాయుడుకు వినతిపత్రం ఇచ్చారు. రెవెన్యూ అధికారులతో చర్చిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు అన్నారు. మండలంలోని నీలకంఠాపురం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. పరిసరాల శుభ్రతపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రసాయనాల వినియోగం.. తేనెటీగలకు హానికరం

జాగ్రత్తలు సూచిస్తున్న నిపుణులు


తేనెటీగలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఈనాడు, ఏలూరు: పంటలపై పిచికారీ చేసే క్రిమిసంహారక రసాయనాలతో తేనెటీగలకు ముప్పు వాటిల్లుతోందని తాజా పరిశోధనల్లో వెల్లడైంది. ఇటీవల జర్మనీలోని బవేరియాలో బయోసెంటర్ ఆఫ్ జూలియస్-మాక్సి మిలియన్స్ వర్సిటీలో జరిగిన అధ్యయనాల్లో ఈ విషయం తెలిసింది. రసాయనాలతో తేనెటీగలు చనిపోవటం, దిగుబడి తగ్గడంతో పెంపకందారులు నష్టాలు చవిచూస్తారని పరిశోధకులు స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా విజయరాయిలోని తేనెటీగల పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త మోహన్‌రావు ఈ పరిశోధన వివరాలను విశ్లేషించారు.

పుప్పొడి, మకరందం కలుషితం..

వ్యవసాయంలో రసాయనాల వాడకం మితిమీరింది. దిగుబడి పెంపు, క్రిమికీటకాల నియంత్రణకు రైతులు ఎక్కువగా మందులు వేస్తున్నారు. పొద్దు తిరుగుడు, నువ్వులు, ఆవాలు, పత్తి, కొబ్బరి, జీడి, మామిడి, నిమ్మ, కర్బూజా మొక్కల్లో మకరందం ఎక్కువగా ఉంటుంది. పురుగు మందులు పిచికారీ చేస్తే పుప్పొడి, మకరందం కలుషితం అవుతాయి. వీటిపై తేనెటీగలు వాలి మకరందం సేకరిస్తే విష ప్రభావంతో చనిపోతాయి.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

ఆంధ్రప్రదేశ్‌లో 5 వేల మంది తేనెటీగలు పెంచుతున్నారు. ఒక్కొక్కరు సగటున 100 పట్టులు నిర్వహిస్తుండగా, ఒక్కోదానికి ఏడాదికి 20 కిలోల చొప్పున మొత్తం 20 క్వింటాలు వరకు తేనె ఉత్పత్తి అవుతోంది. ఒక్కో పట్టులో 60వేల తేనెటీగలు ఉంటాయి. వీటిలో సగం ఆహార సేకరణకు వెళుతూ..రోజుకు 100 వరకు చనిపోతాయి. రసాయనాల ప్రభావంతో వీటి సంఖ్య 600-1000 వరకు ఉంటోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆర్గానోఫాస్ఫేట్, కార్బమేట్స్, సింథటిక్ పైరత్రాయిడ్స్, ఇన్‌సెక్ట్ గ్రోత్ రెగ్యులేటర్స్ వంటి పురుగు మందుల వినియోగంతో చనిపోతున్నట్లు గుర్తించారు. ఒక పట్టులో 30 వేల తేనెటీగలు చనిపోతే ఏడాదికి వెయ్యి కిలోల తేనె దిగుబడి తగ్గిపోయినట్టే!

జాగ్రత్తలతో నివారించవచ్చు

విషపూరిత పురుగు మందులు పిచికారీ చేసే పొలాలు, తోటల్లో తేనెపట్టులు పెట్టకూడదు. పుష్పించే దశలో తేనెటీగలు ఆకర్షిస్తాయి. ఉదయం, మధ్యాహ్న వేళల్లో మకరందం సేకరణకు వెళతాయి. సాయంత్రం పిచికారీ చేస్తే ఆ ప్రభావం ఈగలపై ఉండదు. గాలిలో పిచికారీ చేసినా ఈగలు చనిపోతాయి. మొక్కల మొదళ్లు, నేలలో వేసే గుళికలు, తక్కువ ప్రభావం ఉన్న పురుగు మందులు ఉపయోగించేలా రైతులకు పెంపకందారులు తెలియజేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పురుగు మందుల పిచికారీ సమాచారం ముందుగా చెబితే పెంపకందారులు జాగ్రత్తలు తీసుకునే వీలుంటుందని, పరస్పర సహకారంతో తేనెటీగలను కాపాడు కోవచ్చని చెబుతున్నారు.

పైడిమారమ్మకు మొక్కుల చెల్లింపు



కురుపాం గ్రామీణం: శ్రీ పైడి మారమ్మ వారాల పండగను మంగళవారం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామస్థులు అమ్మవారికి వీరలు, కోళ్లు చూపించి మొక్కులు చెల్లించారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

విత్తనాల పంపిణీ

కురుపాం గ్రామీణం: మనబడి-మనతోట పథకంలో భాగంగా మండలంలోని 144 పాఠశాలలకు కూరగాయల విత్తనాలను ఎంఈవో సత్యనారాయణ పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలోని ఖాళీ ప్రదేశాల్లో పంటలు పండించాలన్నారు. బడి తోటలతో ఆరోగ్యం సొంతం అవుతుందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నకిలీలలు..!

● ఆయా మండలాల తహసీల్దార్ల దృష్టికి వ్యవహారం


కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి


వివిధ ధ్రువపత్రాల్లో నకిలీలు, అధికారుల సంతకాల ఫోర్జరీతో వ్యవహారం కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగుచూసింది. మెళియాపుట్టి, కోటబొమ్మాళి, లావేరు మండలాలకు చెందిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సమర్పించిన వివిధ ధ్రువపత్రాల పరిశీలనలో అసలు విషయం బహిర్గతమైంది.


అధికారుల సంతకాలు ఫోర్జరీ

మెళియాపుట్టి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి చెందిన రిజిస్ట్రేషన్‌కు వచ్చే నెల 13వ తేదీతో తహసీల్దార్ సంతకంతో ఎండార్స్‌మెంట్ ధ్రువపత్రం సమర్పించారు. ఇది క్షేత్రస్థాయి సిబ్బంది నిశిత పరిశీలనకు ఉదాహరణగా నిలిచింది. అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఈనెల 18వ తేదీతో మెళియాపుట్టి మండల తహసీల్దారు ముద్రతో రిజిస్ట్రేషన్ సమయంలో ఫోర్జరీ ధ్రువపత్రం సమర్పించడం గమనార్హం. ఈ వ్యవహారాలపై కోటబొమ్మాళి సబ్ రిజిస్ట్రార్ గురుగుబెల్లి రాజులు, మెళియాపుట్టి తహసీల్దార్ నందిగాం హనుమంతురావును సంప్రదించగా సదరు అధికారి వాటిని మంజూరు చేయలేదని స్పష్టమైంది. గతంలో తహసీల్దారుగా పనిచేసి మృతి చెందిన అధికారి సంతకం ఫోర్జరీగా గుర్తించిన ఎస్ఆర్వో వ్యవహారాన్ని కోటబొమ్మాళి పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు కార్యాలయాన్ని సందర్శించారు.

మండలాలు మార్చేశారు..

లావేరు మండలం పెద్దరావుపల్లి గ్రామానికి చెందిన ఆస్తి గురించి వివరాలు స్పష్టంగా తెలియజేసే వీఆర్వో సంతకం దిగువన పెద్దరావుపల్లి గ్రామం రణస్థలం మండలం అని పేర్కొంటూ స్టాంపు వేయడం గమనార్హం. లావేరు మండలంలోని చెందిన గ్రామం ఒక్కసారిగా రణస్థలంలోకి ఎలా చేరిందో అధికారులకే తెలియాలి. కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన పొజిషన్ ధ్రువపత్రాల్లోనూ నకిలీలున్నట్లు సంబంధిత అధికారి స్పష్టం చేశారు. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వచ్చేనెల 13వ తేదీతో ఇచ్చిన ఎండార్స్‌మెంటు ధ్రువపత్రం


మెళియాపుట్టి తహసీల్దారు దృష్టికి వెళ్లిన ఫోర్జరీ పత్రం

రైతేరాజు

తూటి ఆకుల కషాయంతో మేలు


రైతులకు తయారీని వివరిస్తున్న ఐసీఆర్పీ సమన్వయకర్త

జలుమూరు, న్యూస్‌టుడే: వరిలో వచ్చే తెల్లదోమ, సుడిదోమ నివారణకు తూటి ఆకుల కషాయం ఎంతో మేలు చేస్తుందని ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్పీ సమన్వయకర్త సీహెచ్. పాపారావు పేర్కొన్నారు. యలమంచిలిలో కషాయం తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు.

తయారీ విధానం: 10 కిలోల తూటి ఆకులు, 15 లీటర్ల ఆవు మూత్రంలో వేసి 10 లీటర్ల ద్రావణం వచ్చేవరకు బాగా ఉడకబెట్టాలి. దాన్ని 48 గంటలపాటు చల్లని ప్రదేశంలో ఉంచాలి. తర్వాత 150 లీటర్ల నీటిలో ఆ ద్రావణాన్ని కలిపి ఎకరా విస్తీర్ణం కలిగిన పొలంలో పిచికారీ చేయాలని తెలిపారు.

కేళీలతో వరికి నష్టం

జలుమూరు, పాతపట్నం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో వరి పంట దశకు చేరుకున్న సమయంలో ఒక రకం విత్తనాల్లో మరో రకం వరి మొక్కలు ఉంటే వాటిని కేళీలు అంటారు. వీటిని మూడు దశల్లో గుర్తించి ఏరివేయాలని జలుమూరు వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. పైరు పిలకలు పెట్టడం పూర్తి చేసుకున్న తర్వాత మొక్కల ఎత్తు, ఆకుల రంగు ప్రకారం వాటిని తీసివేయాలి. పూత దశలో చాలా ముందుగా, ఆలస్యంగా వచ్చినవి.. గింజలు గట్టిపడిన దశలో రంగు, పరిమాణం ఇతర లక్షణాల ప్రకారం తొలగించవచ్చు. వీటిని తీసివేయకపోతే పంటకు వేసే ఎరువులను ఇవి ఆశించి నష్టం కలిగిస్తాయని వ్యవసాయాధికారి వివరించారు.





గ్రామాల్లో రైతులు వరితో పాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. వాటికి తెగుళ్ల సోకడంతో పాటు కలుపు మొక్కలు పెరిగి పంట నష్టాలను ఎదుర్కొంటున్నారు. వీటి నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక దిగుబడులు లభిస్తాయో ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త **డాక్టర్ వై.సంధ్యారాణి** తెలియజేశారు. రైతులు చరవాణిలో అడిగిన ప్రశ్నలకు ఆమె ఇలా సమాధానం ఇచ్చారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

తెగుళ్ల నివారణతో అధిక దిగుబడులు

ప్రశ్న: వరిలో ఆకులపైన గోధుమరంగు మచ్చలు ఏర్పడి క్రమేపీ ఎర్రగా మారిపోతున్నాయి.
-ఎస్.రామారావు, చీమలవలస, ఆమదాలవలస మండలం

సమాధానం: వరి పైరుకు అగ్గి తెగులు సోకడంతో ఆకులపైన గోధుమ రంగు మచ్చలు కన్పిస్తాయి. ఇవి ఎక్కువగా కనిపిస్తే ట్రైసైక్లోజోల్ 120 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో పిచికారీ చేసుకుంటే వాటిని నివారించుకోవచ్చు.

?: రబీలో అపరాలు విత్తిన తర్వాత కలుపు నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.
-కె.లక్ష్మణరావు, బురిడికంచరాం, పొందూరు మండలం

☛: అపరాలు విత్తిన వెంటనే లేదా మరుసటి రోజు 1.3-1.6 లీటర్ల పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పొలంలో నేల మొత్తం బాగా తడిచేటట్లు పిచికారీ చేసుకుంటే కలుపును నివారించుకోవచ్చు.

?: మొక్కజొన్న పంటలో మొవ్వులు చనిపోయి ఎండిపోయి పంట దెబ్బతింటుంది.
-కోవిలాపు సవరరాజు, షళంత్రి, సరుబుజ్జిలి మండలం

☛ రబీ మొక్కజొన్న పంటకు గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పురుగులు లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వల్ల మొవ్వు చనిపోయి మొక్కలు ఎండిపోతాయి. దీని నివారణకు 60 మి.లీ క్లోరాంట్రినిలిప్రోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పైరు బాగా తడిచేటట్లు ఎకరా పొలంలో జల్లుకుంటే పురుగును నివారించుకోవచ్చు.

శిథిల భవనాల్లో చిన్నారుల అవస్థలు



అవతరాబాదు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

వైకాపా పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలకు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో అధ్వానంగా మారి నేడు శిథిలావస్థకు చేరుకున్నాయి. చిన్నారులే కదా వారేం అడుగుతారులే అనుకున్నారమో కనీసం ఒక్క భవనాన్ని అయినా నిర్మించిన దాఖలాలు లేవు సరికదా ఉన్నవాటిని గాలికొదిలేశారు. నేడు ఆ శిథిల భవనాల్లో అసౌకర్యాల మధ్య చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి


డకరవలసలో కిటికీలకు తలుపులు లేకుండా ఉన్న గది

సరుబుజ్జిలి మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అవస్థలకు నిలయాలుగా మారాయి. గత వైకాపా ప్రభుత్వంలో ఆ భవనాలకు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో నేడు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. మండలంలోని డకరవలస, అవతరాబాదు, బుడ్డి వలస, విజయరాంపురం తదితర గ్రామాల్లో కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. డకరవలసలో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. వర్షం కురిస్తే భవనం లోపల బయట శ్లాబుపై నుంచి నీరు కారుతూ పిల్లలు కూర్చొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

పెచ్చులూడి పడుతున్నాయి..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పెచ్చులూడి చిన్నారుల మీద పడి ప్రమాదకరంగా మారుతున్నాయని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రానికి అమర్చిన కిటికీలు తలుపులు పాడైన కొత్త వాటిని అమర్చకపోవడంతో సిబ్బంది వస్త్రాలతో వాటిని కప్పి ఉంచుతున్నారు. విద్యుత్తు సరఫరా లేకపోవడంతో సిబ్బంది, పిల్లలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం: అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం
– ఎస్.గీత సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, బూర్జ

మలుపుల్లో జాగ్రత్త



మకరాంపురం కూడలి నుంచి బి.గొనపపుట్టుగ ఆర్అండ్‌బీ రోడ్డులో ఇరువైపులా పచ్చని పొదలు పెరగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించేందుకు పొదలు అడ్డుగా ఉండడంతో కష్టమవుతోందని వాపోతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదన్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరారు. ఈ విషయం ఆర్అండ్‌బీ ఏఈ మోహనరావు వద్ద ప్రస్తావించగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు వచ్చిన వెంటనే తొలగిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

మురుగుతో అవస్థలు

నిత్యం మురుగు, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని గొర్రెలపాడులోని ఓ వీధి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా వీధిలో కాలువలు లేకపోవడంతో నీరంతా వీధి చివరన చేరి నిల్వ ఉండిపోతోంది. దాంతో దుర్వాసన, దోమలు వృద్ధి చెందడంతో అవస్థలు పడుతున్నామన్నారు. దీనిపై కార్యదర్శి మన్మథరావుని వివరణ కోరగా ప్రస్తుతం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మురుగు తొలగించి బ్లీచింగ్ చల్లుతున్నామని తెలిపారు.– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



పింఛను కోసం ఓ పండుటాకు ఆరాటం

● బురద దారిలో 2. కి.మీ. దేకుతూ వెళ్లిన 70 ఏళ్ల వృద్ధురాలు ● సీఎం మోహన్ సొంత జిల్లాలో ఘటన


బురద రహదారిలో వెళుతున్న వృద్ధురాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం నెలనెలా పంపిణీ చేసే వృద్ధాప్య పింఛను కోసం 70 ఏళ్ల వృద్ధురాలు పడిన అవస్థ ఇది... బురద రహదారిపై 2 కిలోమీటర్లు దేకుతూ వెళ్లిన ఉదంతం సీఎం మోహన్ చరణ్ మాఝి సొంత జిల్లా కేంఝర్‌లో చోటుచేసుకోవడంతో చర్చనీయాంశమైంది. కేంఝర్ జిల్లా తెల్కోయి సమితి రాయిసువా గ్రామానికి చెందిన పాధురి దేహురి నడవలేని స్థితిలో ఉన్నారు. పింఛను కోసం మట్టి రహదారిపై దేకుతూ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై తెల్కోయి సమితి అభివృద్ధి అధికారి గీతా ముర్మ మాట్లాడుతూ... పంచాయతీ కార్యాలయానికి చేరుకోలేని లబ్ధిదారులకు నేరుగా పింఛను అందించాలని పీఈవోలకు గతంలోనే దిశానిర్దేశం చేశామన్నారు. వృద్ధురాలి బ్యాంకు ఖాతాలో ఇదివరకే పింఛను జమచేసినట్లు చెప్పారు. బాధితురాలు స్పందిస్తూ పంచాయతీ కార్యాలయానికి రావాలంటూ పీఈవో సూచించడంతో వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

సీతానగరం, న్యూస్‌టుడే: ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా మండలంలోని అప్పయ్యపేటలో 36వ రాష్ట్ర రహదారిపై మంగళవారం ఉదయం భారీ వృక్షం కూలిపోయింది. గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు చేరుకొని పొక్లెయిన్ సాయంతో వృక్షాన్ని తొలగించారు. విద్యుత్తు తీగలు తెగి పడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది. ఆ శాఖ అధికారులు మరమ్మతు పనులు చేసి సరఫరా పునరుద్ధరించారు.


రహదారికి అడ్డంగా ఉన్న వృక్షం

బిడ్డలు వచ్చేవరకూ భయమే..!




బస్సుపై వేలాడుతూ వెళుతున్న విద్యార్థులు

విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ శ్రీకాకుళం నుంచి కొత్తూరు, బత్తిలి వైపు కొన్ని బస్సులు నడుపుతోంది. కొత్తూరు, హిరమండలం, సరుబుజ్జిలి, రొట్టవలస ప్రాంతాల్లో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో అన్ని గ్రూపులు లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు శ్రీకాకుళం, ఆమదాలవలస పట్టణాలకు వస్తున్నారు. వీరంతా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్నారు. ఉదయం 8 నుంచి 10, సాయంత్రం 4-6 గంటల మధ్య బస్సుల్లో ప్రయాణం చేస్తుంటారు. ఆ సమయంలో ఒకటి లేదా రెండు బస్సులే ఉండటంతో ప్రమాదకరంగా వేలాడుతూ వెళుతున్నారు. నిత్యం ఇదే తీరు.. జరగరాని ఘటన జరిగితే బాధ్యులెవరు అంటే సమాధానం లేదు. 'ఇటీవల కొత్త బస్సు వేశాం. ప్రమాదకరంగా పయనించకుండా విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. మరిన్ని బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటాం' అని ఆర్టీసీ శ్రీకాకుళం రెండో డిపో మేనేజరు శర్మ పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం


ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు

మరియమాత మహోత్సవం

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పి.లేవిడి దయగలమాత పుణ్యక్షేత్రం వద్ద మంగళవారం మహోత్సవం నిర్వహించారు. పలువురు ఫాదర్లు భక్తులను ఉద్దేశించి సందేశం ఇచ్చారు. మరియమాతకు ప్రార్థనలు చేశారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా ప్రాంతాల నుంచి క్రైస్తవ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గుమడ వద్ద శ్రమదానం

ఇటీవల కురుస్తున్న వర్షాలతో కొమరాడ మండలంలోని గుమడ, కొమరాడ వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో తెదేపా నాయకుడు బి.శ్రీను లారీల్లో ఇటుక గుండ తెప్పించి గోతుల వేసి తాత్కాలిక మరమ్మతుల పనులు చేపట్టారు. – న్యూస్‌టుడే, కొమరాడ



మత్తు పదార్థాలతో జీవితం నాశనం

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు. ● గరుగుబిల్లి: విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై రమేష్‌నాయుడు అన్నారు. గరుగుబిల్లి జిల్లా పరిషత్తు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.